క్లుప్తంగా

నేడు వై ఏపీ నీడ్స్ జగన్

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షులు జ్ఞాన జగదీష్, టిమ్ములు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు గాయత్రీనగర్, అనంతరం తేనబండ, బజారువీధి సచివాలయాల పరిధిలో కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొంటారన్నారు.

జిల్లేడుపల్లిలో..

బంగారుపాళెం : మండలంలోని జిల్లేడుపల్లె గ్రామ సచివాలయంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి తెలిపారు. సాయంత్రం 3 గంటలకు 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' అనే విషయం గురించి ప్రజలకు తెలియజేస్తామని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించాలని కోరతామని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ధనుర్మాస పూజలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఐరాల: మండల కేంద్రంలోని పాలేటమ్మ, కోదండరామస్వామి ఆలయాల్లో ఆదివారం ధనుర్మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు, విశేష పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

చిత్తూరు నగరంలో..

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో ఆదివారం ధనుర్మాస పూజలు ప్రారంభయ్యాయి. తెల్లవారుజామున తిరుప్పావై సేవ నిర్వహించారు. అనంతరం అభిషేక పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రామ భజనలతో ఆలయంలో సందడి నెలకొంది. అర్చకులు వేణుగోపాల్ తీర్థప్రసాదాలు అందజేశారు.

రైలు పట్టాలపై వ్యక్తి మృతదేహం

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక దొడ్డిపల్లె సమీపంలో రైల్వే పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి గుర్తుతెలియ వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు ఆదివారం గుర్తించారు. దాదాపు 45–50 సంవత్సరాల వ్యక్తి పట్టాల మీద ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. అతని కుడి చేతిపై నెమలి ఈక బొమ్మ ఉన్న పచ్చబొటు ఉంది. తెలుపు, నీలిరంగు నిలువు గీతల చొక్కా, నీలి, నలుపు రంగుల గీతల లుంగీ ధరించి ఉన్నట్లు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు చిత్తూరు రైల్వే పోలీసులను లేదా 9494228854ను సంప్రదించాలన్నారు.

అలరించిన జాతర వేషధారణలు



వేషధారణల్లో విశ్రాంత ఉద్యోగులు

కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరంలో ఆదివారం నుంచి ప్రారంభమైన బంగారమ్మ జాతరను పురస్కరించుకుని విశ్రాంత ఉద్యోగులు ఆర్టీసీ డ్రైవర్ సుబ్రమణ్యంరాజు, మధు, చంద్ర, ధనశేఖర్ మొదలియార్ తదితరుల ఆధ్వర్యంలో వేసిన జాతర వేషధారణాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా గ్రామ వీధుల్లో పొంగళ్ల గంపలతో తిరుగుతూ వివిధ రకాలైన ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం బంగారమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు ఆనందగిరిపై కల్యాణోత్సవం

పాకాల: ఆనందగిరి కొండపై వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో షష్ఠి సందర్భంగా సోమవారం స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ కళ్యాణోత్సవంలో పాల్గొనేవారు రూ.1,116 చెల్లించాలని తెలిపారు. అలాగే 54 అడుగుల సుబ్రమణ్య స్వామి విగ్రహ నిర్మాణానికి సహకరించిన విరాళ దాతలు ఈ కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చని, వారు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. కల్యాణోత్సవంలో పాల్గొనే ప్రతీ ఒక్కరికి సుబ్రమణ్య స్వామి తీర్థ ప్రసాదాలతో పాటు, స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ప్రసాదాలను కూడా ఉచితంగా అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకుని స్వామివారి కృపకు పాత్రులవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈఓ యువరాణి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వామివారికి వెండి పళ్లెం అందజేస్తున్న దాత సుబ్బారెడ్డి



ఆలయ అధికారులకు విరాళ చెక్కు అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు



వరసిద్ధునికి విరాళాలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక దేవాస్థానం నిత్యాన్నదానానికి రూ.లక్ష, వెండి హారతి పళ్లెం ఆదివారం విరాళాలుగా అందాయి. బెంగళూరుకు చెందిన సుబ్బారెడ్డి సుమారు రూ.75 వేల విలువైన కిలో వెండి పళ్లెం వితరణగా అందజేశారు. ఉదయం ఆలయానికి విచ్చేసి అధికారులకు పళ్లెం అందజేశారు. అలాగే నిత్యాన్నదానానికి నెల్లూరుకు చెందిన కోదండరామిరెడ్డి కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళం ఇచ్చారు. దాత కుటుంబ సభ్యులకు ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు విగ్నేష్, రమేష్ పాల్గొన్నారు.



కాకినాడ ఎమ్మెల్యే కన్నబాబుకు చిత్రపటం అందజేస్తున్న ఏఈవో

వినాయకుని సేవలో కాకినాడ ఎమ్మెల్యే

కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని ఆదివారం మాజీ మంత్రి, కాకినాడ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా ఆలయం వద్దకు వచ్చిన వారికి ఏఈవో హరిమాధవ రెడ్డి స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులతో ఆశీర్వచనం అందించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

21న గుడిపాలలో సేవా కార్యక్రమాలు



ఏర్పాట్లు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుడిపాల: ఈనెల 21వ తేదీన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలో భారీగా సేవా కార్యక్రమాలకు వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరోజు మధ్యాహ్నం 2.30 గంటలకు ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి మండలంలోని 9,267 మంది డ్వాక్రా మహిళలకు చీరలతో పాటు వారి కుటుంబ సభ్యులకు ప్యాంట్, షర్ట్‌లను అందజేయనున్నారు. భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం ఆదివారం జేసీబీలతో బహిరంగ సభకు స్థలాన్ని చదును చేశారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

గుడిపాల: మండలంలోని జన జాగృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బెంగళూరు వైదేహి ఆస్పత్రి సహకారంతో ఆదివారం మండలంలోని చిత్తపార గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పదిమంది డాక్టర్లు శిబిరంలో వైద్య సేవలు అందించారు. 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, మాత్రలను అందజేశారు. వైదేహి సమన్వయకర్త లోకేష్, జన జాగృతి సంస్థ కార్యదర్శి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రవణా నక్షత్ర పూజలు



ఉభయ దేవేరులతో కల్యాణ వెంకన్న ఊరేగింపు

నారాయణవనం: శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామున తిరుప్పావై సేవతో ఆలయాన్ని తెరచి నిత్యపూజా కైంకర్యాలను, ధనుర్మాస పూజలను అర్చకులు పూర్తి చేశారు. స్వామివారి జన్మ నక్షత్రమైన శ్రవణ గడియల్లో అర్చనలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చి వాహనం కొలువుదీర్చి తిరువీధుల్లో ఊరేగించారు. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించి నైవేద్య సమర్పణం చేశారు. ఆలయ షరాబు షనాయి, భద్రతా జమేదార్ రాజశేఖర్ పర్యవేక్షించారు.

ధనుర్మాస పూజలు ప్రారంభం

ధనస్సు రాశిలోకి సూర్య సంక్రమణం సందర్భంగా మండలంలోని ఆలయాల్లో ఆదివారం ధనుర్మాస పూజలను ప్రారంభించి, భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్ధరాత్రి 12 గంటలకు ఆలయంలో ధనుర్మాస ప్రారంభ గడియల్లో పూజలను, గంట, నైవేద్య కార్యక్రమాలను అర్చకులు పూర్తి చేశారు. ఆదివారం వేకువ జామున తిరుప్పావై ప్రవచనాలతో ఆలయాన్ని తెరచి శుద్ధి, తోమాల నిర్వహించారు. ధనుర్మాస పూజలను పూర్తి చేసి 5 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతించారు. అలాగే టీటీడీ అనుబంధ ఆలయాలైన అవనాక్షమ్మ, అగస్తీశ్వర, పరాశురేశ్వర, అవనాక్షమ్మ, శక్తి వినాయక, వీరభద్ర స్వామి ఆలయాలతో పాటు ప్రఖ్యాత పర్యాటక కేంద్రమైన కైలాసనాథకోనలోని కామాక్షాంబిక సమేత కైలాసనాథ ఆలయంలో, స్థానిక సారకాయలస్వామి, వీరరాఘవస్వామి ఆలయాలను వేకువ జామున తెరచి ధనుర్మాస పూజలను నిర్వహించారు.

సారా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సారా ప్యాకెట్లు

గుడిపాల: మండలంలోని పాపిశెట్టిపల్లె ప్రాంతంలో ఆదివారం దాడులు నిర్వహించి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రామమోహన్ తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు దాడి చేశామన్నారు. పోలీసులను చూడగానే సారా తయారీ దారులు పరార్ అయ్యారని, 30 లీటర్ల సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. సారా విక్రేత ప్రాంక్లిన్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జోష్ నింపిన బస్సుయాత్ర

- సాధికార యాత్ర విజయవంతంతో నేతల్లో ఆనందం
- కార్యకర్తల్లో నూతనోత్సాహం



శనివారం పలమనేరు బస్సుయాత్రకు భారీగా హాజరైన జనం(ఫైల్)

పలమనేరు: పలమనేరులో రెండ్రోజుల క్రితం జరిగిన సామాజిక సాధికార బస్సుయాత్ర సూపర్ సక్సెస్ కావడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్‌ను నింపింది. గతంలో రెండు పర్యాయాలు ఈ బస్సుయాత్ర వివిధ కారణాలతో వాయిదా పడటం విదితమే. తర్వాత తేదీ ఖరారు కావడంతో సభకు విజయవంతం చేయడానికి ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆయా మండలాల నేతలతో ఎప్పటికప్పుడు మాట్లాడారు. ఊహించని దానికంటే ఎక్కువగా జనం సభకు రావడంతో క్యాడర్‌లో ఉత్తేజాన్ని నింపింది. వచ్చే ఏడాది ఎన్నికలు రానున్న నేపథ్యంలో బస్సుయాత్ర పార్టీకి బూస్టప్‌నిచ్చిందని స్థానికంగా పలువురు చర్చించుకోవడం కనిపించింది. నెల రోజులుగా ఆయా పంచాయతీల్లో వై ఏపీ నీడ్స్ జగన్, జగనన్నకు చెబుదాం, జగనన్న ఆరోగ్య సురక్ష, మెగా జాబ్‌మేళా, నిరుపేదలకు భూపంపిణీ, ఆడుదాం ఆంధ్రా, మసీదులకు శాశ్వత పట్టాల పంపిణీ..ఇత్యాది కార్యక్రమాలతో పాటు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో ఎమ్మెల్యే జనంతో మమేకమవుతూనే ఉన్నారు. ఇలా ఎమ్మెల్యే ప్రజలకు బాగా దగ్గర కావడంతోనే సామాజిక సాధికార యాత్రకు జనం స్వచ్ఛందంగా హాజరైనట్లు రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు నిత్యం ఏదో ఓ కార్యక్రమంతో గ్రామాలకు వెళుతూనే ఉన్నారు. దీన్ని గమనించి ఎక్కడ తమకు గ్రాఫ్ పడిపోతుందనే భయంతో ఇక్కడి మాజీ మంత్రి అమరనాథరెడ్డి సొంతంగానే ఇంటింటికీ తెలుగుదేశం పేరిట అక్కడక్కడ కొన్ని గ్రామాలకు వెళ్లడం చేస్తున్నారు. దీన్ని బట్టి చూస్తే ప్రతిపక్షాలు సైతం వైఎస్సార్ సీపీ దారిలో వెళుతున్నాయనేది అర్థమవుతోంది.

బోస్ చేరికతో వైఎస్సార్ సీపీకి లాభం

2014 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా సుభాష్ చంద్రబోష్, ఆయనకు ప్రత్యర్థిగా వైఎస్సార్‌సీపీ నుంచి అమరనాథ రెడ్డి పోటీపడ్డారు. టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన అమర్ స్వల్ప మెజారిటీతో బయటపడ్డారు. అయితే ఆపై టీడీపీలో బోస్‌కు తగిన ప్రాధాన్యత లేకుండా అమరనాథ రెడ్డి చూడడంతో ఆయన పార్టీకి దూరంగా ఉంటూ వచ్చారు. ఇటీవల ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసి మూడ్రోజుల క్రితం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో ఆయన చేరారు. చేరిన వెంటనే సాధికార సభలో పాల్గొన్నారు. పార్టీలతో పనిలేకుండా బోస్‌కున్న వర్గం ఆయన వెనుకే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయన చేరిక వైఎస్సార్‌సీపీకి మేలు చేస్తుందనే మాట పట్టణంలో వినిపిస్తోంది. బోస్ టీడీపీని వీడి మాజీమంత్రి అమర్‌పై పలు విమర్శలు చేసినా ఆ పార్టీ నుంచి మౌనమే సమాధానమైంది. దీన్నంతా గమనిస్తున్న జనం బోస్ ఆలస్యమైనా మంచి పని చేశారనే చర్చ మొదలైంది. ఏదేమైనా సామాజిక సాధికార బస్సుయాత్ర నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

బంగారుపాళెం: మండలంలోని మాధవనగర్‌లో ఉన్న జీసస్ బ్లెస్సింగ్ చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రార్థనలు చేపట్టారు. పాస్టర్లు కిరణ్‌జాన్‌పాల్, యోహాన్ ఏసుక్రీస్తు జీవిత చరిత్ర, ఆయన సందేశాలను వివరించారు. అనంతరం పేదలకు వస్త్రదానం చేశారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాస్టర్లు మైకేల్, ప్రతాప్, మేషాక్ తదితరులు పాల్గొన్నారు.



వస్త్రదానం చేస్తున్న పాస్టర్లు



చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

నేడు ఎగువ తడకరలో ఫ్యామిలీ డాక్టర్

తవణంపల్లె: మండలంలోని ఎగువ తడకరలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. ఈ అవకాశాన్ని పంచాయతీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

బైరెడ్డిపల్లె: స్థానిక చెక్‌పోస్టు కూడలిలోని రాయల్‌మహల్‌లో ఆదివారం నిర్వహించిన కళాతరంగిణి సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి విచ్చేసిన కళాకారులు, విద్యార్థులు జానపద, నృత్య, సాంస్కృతిక ప్రదర్శనతో ప్రతిభను చాటుకున్నారు. కళాకారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కళా తరంగిణి సంస్థ వ్యవస్థాపకులు రాజేష్‌బాబు, ఎస్‌ఐ మోహన్‌కుమార్, ఎంఈఓ–2 సుబ్రమణ్యం, న్యాయనిర్ణేతలు సంధ్య, మస్తాన్, బాలాజి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో స్పందన

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహిస్తున్నట్లు కమిషనర్ జె.అరుణ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1–30 వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని 50 డివిజన్లలోని సచివాలయ కార్యాలయాల్లో కూడా మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్పందన జరుగుతుందన్నారు. స్థానికంగా ఉన్న ప్రజలు ఆయా సచివాలయాల్లో వినతులు అందచేయవచ్చని తెలిపారు. ప్రజలు ఇంటి నుంచే కార్పొరేషన్ కాల్ సెంటర్ 08572232745, వాట్సప్ – 98499 07885 నంబర్లకు సమస్యలు తెలియచేయవచ్చన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో ..

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మురళీమోహన్ తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తామన్నారు. ప్రజలు సమస్యలపై నేరుగా అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

నేడు పూతలపట్టులో..

పూతలపట్టు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ విజయభాస్కర్ తెలిపారు. ఉదయం 10:30 నుంచి ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదులు అందజేయవచ్చని పేర్కొన్నారు.

న్యాయశాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న గోపినాథ్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: న్యాయశాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని ఆ శాఖ ఉద్యోగ సంఘ నాయకులు కోరారు. ఆదివారం చిత్తూరు నగరంలోని పాత కోర్టు ప్రాంగణంలో జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సర్వసభ్య సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు కె.గోపినాథ్‌రెడ్డి మాట్లాడుతూ న్యాయస్థానాల్లో పెండింగ్ కేసులను పరిష్కారానికి అదనపు సిబ్బందిని నియమించాలని కోరారు. క్రిమినల్, సివిల్ కేసులను పరిష్కరించే జూనియర్ సివిల్ జడ్జిల కోర్టుల్లో చార్జ్‌షీట్‌ల నిర్వహణ కోసం అదనపు సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్లను నియమించాలన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మీపతి మాట్లాడుతూ అర్హులైన వారికి వెంటనే పదోన్నతులు ఇవ్వాలన్నారు. పదవీ విరమణకు దగ్గరిలో ఉన్న ఉద్యోగుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సానుకూల ప్రాంతాలకు బదిలీ చేసేందుకు వీలు కల్పించాలన్నారు. అసోసియేట్ అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుందర్, ఉపాధ్యక్షులు జి.దామోదరం, గణేష్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులు డిజి.దామోదరం, హరికృష్ణ, పవన కుమారి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాల సాధనతో ఉన్నత శిఖరాలు



మాట్లాడుతున్న ఏఎస్‌పీ లక్ష్మీనారాయణరెడ్డి

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని దాన్ని సాధించేందుకు కృషి చేస్తే ఉన్నత స్థానాలు తథ్యమని తిరుపతి జిల్లా ఏఎస్‌పీ లక్ష్మీనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని మురుగానిపల్లెలో విజ్ఞాన సుధ విద్యా సంస్థల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. పాల్గొన్న ఏఎస్‌పీ మాట్లాడుతూ విద్యార్థుల ఎదుగుదలకు ఉన్నత లక్ష్యాలు చాలా ముఖ్యమన్నారు. తన ఎదుగుదలకు ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఎప్పటికీ మరువలేనని చెప్పారు. క్రమశిక్షణ అలవరచు కోవాలన్నారు. కళాశాల వైస్ చైర్మన్ శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జబర్దస్త్ చమ్మక్‌చంద్ర బృందం ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో వివిధ ఎంఎన్‌సీ కంపెనీల ప్రతినిధులు, లెక్చరర్‌లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీవారి వైభవాన్ని చాటిన సుబ్రమణ్యశాస్త్రి



సాధు సుబ్రమణ్యశాస్త్రికి పుష్పాంజలి ఘటిస్తున్న టీటీడీ అధికారులు

తిరుపతి కల్చరల్: తిరుమల శ్రీవారి ఆలయంలోని శాసనాలను అనువదించి ఆలయ చరిత్రను, శ్రీవేంకటేశ్వరస్వామివారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు సాధు సుబ్రమణ్య శాస్త్రి అని ప్రముఖ శాసన పరిశోధకుడు తొండవాడ సారకాయల కృష్ణారెడ్డి తెలిపారు. అన్నమాచార్య కళామందిరంలో ఆదివారం సాధు సుబ్రమణ్యశాస్త్రి 135వ జయంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవారి ఆలయం ఉన్నంతవరకు ఆయన చిరంజీవిగా నిలుస్తారన్నారు. టీటీడీలో చిన్నస్థాయి ఉద్యోగిగా ఉంటూ వెయ్యికి పైగా శాసనాలను వెలికితీసి పరిష్కరించిన గొప్ప వ్యక్తి సుబ్రమణ్యశాస్త్రి అని చెప్పారు. అన్నమయ్య రచించిన 32 వేల సంకీర్తనల్లో 12 వేల సంకీర్తనలు మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు. ఇందులో అధిక భాగం సంకీర్తనలను శాస్త్రి పరిష్కరించి సమాజానికి అందించారని వివరించారు. దీనికి ముందు టీటీడీ సీఏఓ శేషశైలేంద్ర మాట్లాడుతూ తిరుమల శ్రీవారికి అమూల్యమైన సేవలందించిన సాధు సుబ్రమణ్యశాస్త్రి, వేటూరి ప్రభాకరశాస్త్రి, రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ వంటి మహానుభావుల జీవితాలను, వారు చేసిన కృషిని విద్యార్థులు తప్పనిసరిగా తెలుసుకోవాలన్నారు. అలాగే సాధు సుబ్రమణ్యశాస్త్రి వెలికితీసి పరిష్కరించిన శాసనాల పుస్తకాలను పిల్లలు, పెద్దలు కూడా చదవాలన్నారు. అంతకుముందు సాధు సుబ్రమణ్య శాస్త్రి జయంతి సందర్భంగా శ్వేత భవనం ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి సీవీఅండ్‌ఎస్‌ఓ నరసింహ కిషోర్, టీటీడీ పీఆర్‌ఓ డాక్టర్ టి.రవి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో శాస్త్రి కూతురు గిరిజ, మనుమడు, జడ్జి శ్రీమూర్తి, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు విభీషణ శర్మ పాల్గొన్నారు.

జనవరి 21న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

తిరుపతి కల్చరల్: తిరుపతి బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో జనవరి 21వ తేదీన తిరుపతి బైరాగిపట్టెడలోని వైఖానస కల్యాణ వేదికలో రాష్ట్రస్థాయి బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు భీమాస్ బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివాహ పరిచయ వేదికతో పాటు ఇదే రోజు ఉదయం 6 గంటలకు బ్రాహ్మణులకు షష్టిపూర్తి, భీమరథ శాంతి మహోత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని బ్రాహ్మణ కుటుంబ సభ్యులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో పాల్గొనదలచిన వారు 90301 77388, 99493 39851 నంబర్లను సంప్రదించి, పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి



బీసీల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న వివిధ కులాల ప్రతినిధులు

పలమనేరు: జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లను కల్పించాలని ఏపీ అత్యంత వెనుకబడిన కులాల సంఘ అధ్యక్షులు పూసల రవి విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని లయన్స్‌సేవా కేంద్రంలో నియోజకవర్గంలోని బీసీల కులాల ప్రతినిధులతో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఇన్నేళ్లకు కులగణన చేయడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూనుకోవడం ఆనందంగా ఉందన్నారు. దీనిమూలాన కులాల వారీగా జనాభా లెక్క పక్కాగా తేలుతుందన్నారు. జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలకు రాజకీయ అవకాశం కల్పించే దిశగా కేంద్రం ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ పాలనలో బీసీలకు ప్రాధాన్యత పెరగడం హర్షణీయమన్నారు. వివిధ కులాల ప్రతినిధులు హరి, గురుమూర్తి, కృష్ణప్ప, గిరిధరమూర్తి, సుదర్శన్, శంకర్, వెంకటేష్, హరినాథ్, గిరి, మనోహర్,మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.